ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
యాదాద్రి భువనగిరి
5
సోమవారం 22 జనవరి 2024

హెల్ప్‌లైన్ నంబర్లు
దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980
నల్లగొండ : 18004251442
యాదాద్రి : 1800 425 7106
సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు
గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.119	173	196
సూర్యాపేట	రూ.120	170	200
నల్లగొండ	రూ.119	173	196

ఉష్ణోగ్రత గరిష్ఠం 28.5 । కనిష్ఠం 18.0


భువనగిరిలో ముస్తాబైన రామాలయం



ఆలయం వద్ద విద్యుత్ దీపాల అలంకరణ

అంతా రామమయం

అయోధ్యలో రామాలయం సాక్షాత్కారం కావడం, రామ్‌లల్లా విగ్రహాన్ని ప్రతిష్టించనుండటంతో ఏళ్లుగా ఎదురుచూస్తున్న రామ భక్తులు ఆనందానికి అవధుల్లేవు. బాలరాముడి విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ వేళ ఉమ్మడి జిల్లా అంతటా ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు అంతటా ఏర్పాట్లు జరిగాయి. ఆలయాలను శుభ్రం చేసి పూలు, మామిడి తోరణాలతో అందంగా అలంకరించారు. ఉదయం నుంచి రాత్రి వరకు పూజలు, ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదానానికి నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తిచేశారు. దీపాలు వెలిగించి బాణాసంచా కాల్చేందుకు రామభక్తులు సిద్ధమయ్యారు.

• 7, 8లో..

ఐదు రోజులు నడిచి అయోధ్య వెళ్లాము



కరసేవలో 1990, అక్టోబరు నెలలో భువనగిరి నుంచి పదుల సంఖ్యలో రైలులో బయలుదేరాం. అయితే కరసేవను నిలువరించేందుకు అప్పటి యూపీ సీఎం ములాయంసింగ్‌యాదవ్ అడుగడుగునా పోలీసులను ఏర్పాటుచేశారు. మేం ప్రయాణిస్తున్న రైలును కాశీ సమీపంలో అడ్డుకొని మమ్మల్ని అరెస్ట్ చేసి వేర్వేరు జైళ్లకు తరలించారు. ఈ క్రమంలో నాతో పాటు మరికొద్దిమంది కరసేవకులను బస్సులో మరో ప్రాంతానికి తరలిస్తుండగా, ముగ్గురం పోలీసుల నుంచి తప్పించుకొని ఐదు రోజులు కిలోమీటర్ల కొద్దీ నడిచి అక్టోబరు 30 అయోధ్యకు చేరుకున్నాం. నవంబరు 1, 2న అక్కడే ఉండి ఆలయ పరిక్రమలో పాల్గొంటుండగా పోలీసులు పేల్చిన రబ్బరు తూటాలు, లాఠీ దెబ్బలతో నాతోపాటు భువనగిరికి చెందిన నాకోటి జగన్నాథం, పి.అమరేందర్‌రెడ్డికి గాయాలయ్యాయి. అయితే నడక మార్గంలో లభించిన స్థానికుల ఆదరణ ఎన్నటికీ మరువలేం. అయోధ్య ఆలయ నిర్మాణ ఉద్యమంలో పాల్గొనడం, ఆ కల నేటితో నెరవేరడం మా పూర్వజన్మ సుకృతం.

- పాశం భాస్కర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

పోలీసులు పట్టుకుని జైలులో నిర్బంధించారు



అయోధ్యకు రామన్నపేట తాలూకా నుంచి సుమారు 70 మంది అయోధ్యకు బయల్దేరాం. యూపీలో పోలీసులు పట్టుకుని ఫతేపూర్ జైలులో నిర్బంధించారు. జైలులో సుమారు 10రోజుల వరకు ఉన్నాం. ఆ తరువాత మమ్మల్ని ప్రయాగలో వదిలేశారు. స్వామిజీలతో పాటు ఊరేగింపులో పాల్గొనగా, పోలీసులు లాఠీచార్జి చేయడంతో పక్కన ఉన్న పొలాల నుంచి తప్పించుకుని అయోధ్యకు చేరుకున్నాం. ప్రధాన రహదారి ఎక్కితే పోలీసులు అరెస్ట్ చేశారు. మేమంతా గుంపులుగా తప్పించుకు వెళ్లాం. అక్కడి గ్రామాల ప్రజలు మమ్మల్ని బాగా చూసుకున్నారు. భోజనం వండి పెట్టారు. మాతో పాటు కొంతమంది అయోధ్యకు వచ్చారు. పోలీసుల లాఠీచార్జ్‌లో గాయపడిన వారిని మేం ఆస్పత్రిలో చేర్చి సేవలందించాం. ఆ అనుభూతిని, సేవాకార్యక్రమాలను జీవితంలో మరచిపోలేం. ఇన్నేళ్లకు అయోధ్యలో రామమందిరం సాకారం కావడం మరచిపోలేనిది.

- త్రివేది ఉమేష్‌శర్మ, చిట్యాల

సమన్వయంతో అభివృద్ధి

- ప్రజాప్రతినిధులంతా ప్రజలకు అందుబాటులో ఉండాలి
- భువనగిరిలో మోడల్ క్రికెట్ స్టేడియం
- టూరిజం స్పాట్లుగా భువనగిరి, కొలనుపాక
- సాగునీటి ప్రాజెక్టుల పనుల పూర్తికి చర్యలు
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి వెంకట్‌రెడ్డి

యాదాద్రి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అభివృద్ధి పనులు ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో పూర్తి చేస్తామని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్ హనుమంతు కె.జెండగెతో కలిసి నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇది ప్రజా ప్రభుత్వమని, ప్రజాప్రతినిధులందరూ ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. దక్షిణ భారత దేశంలో ఎక్కడా లేని విధంగా భువనగిరిలో మోడల్ క్రికెట్ స్టేడియాన్ని నిర్మిస్తామని, అందుకు రెండు నెలల్లోగా టెండర్లు పిలుస్తామన్నారు. రాయిగిరి వద్ద 10ఎకరాల స్థలంలో ఈ మల్టీపర్పస్ స్టేడియాన్ని రూ.33.50కోట్లతో నిర్మిస్తామని, అందుకు నాలుగు రోజుల్లోగా డీపీఆర్ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. జాతీయ స్థాయిలో జరిగే పోటీలను భువనగిరిలో నిర్వహించేలా స్టేడియాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు. భువనగిరి ఖిల్లాను టూరిజం స్పాట్‌గా చేయాలని నిర్ణయం తీసుకున్నామని, కేంద్రం రూ.100కోట్లు మంజూరు చేసిందన్నారు. కేంద్రం నిధులు సరిపోని పక్షంలో రాష్ట్ర ప్రభుత్వ నిధులు మంజూరు చేస్తామన్నారు. ఎయిమ్స్‌లో వసతులు పెంచడంలో భాగంగా రెండు టవర్ల పనులు వేగంగా జరుగుతున్నాయని, మరిన్ని వసతులు కల్పిస్తామన్నారు. బస్వాపూర్ రిజర్వాయర్‌తోపాటు ధర్మారెడ్డి, బునాదిగాని, పిలాయిపల్లి కాల్వల పూర్తికి చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీపై సమీక్షించి రైతుల సమస్యలతోపాటు 18ఏళ్లు నిండిన వారికి కూడా పరిహారం అందేలా చూడాలని అధికారులను ఆదేశించినట్టు తెలిపారు. యాదగిరిగుట్టలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతుల కల్పనకు దేవాదాయశాఖ మంత్రితో సమావేశాన్ని ఏర్పాటుచేస్తామన్నారు. గుట్టపైకి ఆటోలను అనుమతించేందుకు ఆలోచన చేస్తామన్నారు. కొలనుపాకను పర్యాటక ప్రాంతంగా ఏర్పాటుచేస్తామని, రూ.15కోట్లతో ఆర్‌అండ్‌బీ నిధులతో బ్రిడ్జి నిర్మాణంతో పాటు జైన దేవాలయం వరకు రోడ్డు వెడల్పు చేస్తామన్నారు. బ్రిడ్జి పనులకు ఈనెల 24న శంకుస్థాపన చేస్తామన్నారు. భువనగిరి, ఆలేరు నియోజకవర్గాల్లో బ్రిడ్జిల నిర్మాణానికి రూ.60కోట్లు కేటాయించామన్నారు. రుద్రవెల్లి, సంగెం, బొల్లేపల్లి, అనాజీపురం వరకు రోడ్లు మంజూరు చేశామన్నారు. భువనగిరి మునిసిపాలిటీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేస్తామన్నారు. త్వరలో గ్రామానికి 100 ఇందిరమ్మ ఇళ్లను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఆర్‌ఆర్‌ఆర్ అలైన్‌మెంట్ మారుస్తాం

రీజినల్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్ మార్చేందుకు తగిన చర్యలు తీసుకుంటామని, అధికారుల నివేదికపై త్వరలోనే సమీక్ష నిర్వహిస్తామని మంత్రి వెంకట్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రానికి ఆర్‌ఆర్‌ఆర్ మరో మణిహారంలా నిలుస్తుందని, దీని ద్వారా నూతనంగా పరిశ్రమలు వస్తాయన్నారు. ప్రభుత్వం ఏర్పడి 40రోజులే అవుతోందని, పాలనను గాడిలో పెట్టేందుకు ముఖ్యమంత్రి చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్ల వద్ద లాగ్‌బుక్‌లను అందుబాటులో ఉంచుతామన్నారు. భువనగిరి, నల్లగొండ ఎంపీ స్థానాలను కైవసం చేసుకుంటామని, దేశంలోనే అత్యధిక మెజార్టీ సాధిస్తామన్నారు. గత ప్రభుత్వంలో యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో రూ.10వేల కోట్ల కమీషన్లు తిన్నారని, దోచుకున్న సొమ్మును కక్కించేందుకు విజిలెన్స్‌తో పాటు న్యాయ విచారణ చేపడతామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీగా పనిచేస్తుందన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు జి.వీరారెడ్డి, భాస్కర్‌రావు, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ ఈఈలు శంకరయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పంచాయతీలకు పూర్వవైభవం తెస్తాం

- గత ప్రభుత్వ హయాంలో పంచాయతీ వ్యవస్థ నిర్వీర్యం
- కాంగ్రెస్ పార్టీతోనే అధికార వికేంద్రీకరణ
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి


కాల్వపల్లితండాలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మేళ్లచెర్వు, జనవరి 21: గత ప్రభుత్వ హయాంలో గ్రామపంచాయతీ వ్యవస్థ నిర్వీర్యమైందని,వాటికి పూర్వ వైభవం తీసుకువస్తామని నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని వేపలమాదారం గ్రామంలో రూ.20లక్షలతో నిర్మించిన పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వం సర్పంచులు,చైర్మన్ల అధికారాలు తగ్గించి, అధికారులతో పాలన సాగించిందన్నారు.కాంగ్రెస్‌తోనే అధికార వికేంద్రీకరణ జరుగుతుందన్నారు. స్థానిక సంస్థలను బలపరుస్తామన్నారు.మేళ్లచెర్వు మీదుగా ప్యాసింజర్ రైలును నడుపుతామని, ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేస్తామన్నారు. అదేవిధంగా చింతలపాలెం మండలంలోని రేబల్లె, యతిరాజాపురం తండాల్లో పంచాయతీ భవనాలను ప్రారంభించారు. పులిచింతల ప్రాజెక్టు కాలనీలో సీసీరోడ్డుకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కొట్టె పద్మ, సైదేశ్వరరావు, జడ్పీటీసీ పద్మగోవిందరెడ్డి, సర్పంచ్‌లు సునీత, నర్సింహమూర్తి, ఎంపీటీసీ బండారుపల్లి రామకృష్ణ, మోహన్‌రెడ్డి, వెంకయ్య,ఇంద్రారెడ్డి పాల్గొన్నారు.

నిరంకుశ, నియంతృత్వ పాలన పోయింది

మఠంపల్లి: రాష్ట్రంలో నిరంకుశ, నియంతృత్వ బీఆర్ఎస్ పాలన పోయి, సుభిక్షమైన కాంగ్రెస్ పాలన వచ్చిందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని కాల్వపల్లితండా, కొత్త దొనబండతండాలలో రూ.25లక్షలతో నిర్మించిన పంచాయతీ భవనాలు, రూ.13లక్షలతో అంగన్‌వాడీ భవనాలు, లాలితండా పంచాయతీలో రూ.20లక్షలతో నిర్మించిన పంచాయతీ భవనాన్ని మంత్రి ప్రారంభించి మాట్లాడారు. గత ప్రభుత్వం సహకరించకున్నా నియోజకవర్గంలో 25 గ్రామాలకు నూతన పంచాయతీ భవనాలకు నిధులు మంజూరు చేయించానన్నారు. కాల్వపల్లి, కొత్త దొనబండతండా పంచాయతీల్లో మౌలిక వసతుల కల్పనకు రూ.5లక్షల చొప్పున నిధులు మంజూరీ చేస్తానన్నారు. లాలితండా పంచాయతీ కార్యాలయానికి ప్రహరీ నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరు చేస్తానన్నారు. రైతుల విన్నపం మేరకు అమరవరం లిఫ్టుకు 15 రోజుల్లోగా మరమ్మతులుచేసి పని చేసేలా చూస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కల్యాణలక్ష్మీ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని మంత్రికి సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు రన్‌మియా ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఎస్ఈ రామకృష్ణ, జడ్పీటీసీ జగన్‌నాయక్, ఎంపీపీ ఎం.పార్వతి, సర్పంచులు మాలోతు సుజాత, విజయ, బోడి, నాయకులు సాముల శివారెడ్డి, భూక్యమంజూనాయక్, ఆధూరి కిషోర్‌రెడ్డి, ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, డీఎస్పీ ప్రకాష్, డీఈ వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ మంగ, ఎంపీడీవో జానకిరాములు, పాల్గొన్నారు.

ప్రగతి పనులు వేగంగా పూర్తిచేయాలి

హుజూర్‌నగర్: ప్రగతి పనులు వేగంగా పూర్తి చేయాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలెక్టర్, ఇతర అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధికి సంబంధించి పలు అంశాలను మంత్రితో కలెక్టర్ చర్చించారు. సాగునీటి రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తామని అన్నారు. ఎత్తిపోతల నిర్మాణం పూర్తిచేయాలని, సాగర్ కాల్వల ఆధునికీకరణ పనుల్లో వేగం పెంచాలన్నారు. నిర్మాణంలో ఉన్న చెక్ డ్యామ్‌లను పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తామని తెలిపారు. అదేవిధంగా మెప్మాలో పనిచేస్తున్న ఆర్పీల వేతనాలను వెంటనే మంజూరు చేయాలని మంత్రికి ఆర్పీలు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో తన్నీరు మల్లికార్జున్‌రావు, గెల్లి రవి, కస్తాల శ్రావణ్, కోతి సంపత్‌రెడ్డి, అరుణ్‌కుమార్, చక్కెర వీరారెడ్డి, దొంతగాని శ్రీనివాస్, పెండెం శ్రీనివాస్, సుజాత, మంజూనాయక్, ఎండీ.నిజాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులను ఓటరుగా నమోదు చేయాలి

- కలెక్టర్ హనుమంత్ కె.జెండగె


ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంత్ కె.జెండగె

ఆలేరురూరల్, జనవరి 21: అర్హులైన ప్రతీ ఒక్కరిని ఓటరుగా నమోదు చేయాలని కలెక్టర్ హనుమంత్ కె.జెండగె బీఎల్‌వోలను ఆదేశించారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్థానిక ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఆయన తనిఖీచేసి మాట్లాడారు. మృతి చెందిన, వలస వెళ్లిన ఓటర్లు, చిరునామా మారిన ఓటర్లపై దృష్టి సారించాలన్నారు.ఓటరు జాబితాపై అభ్యంతరాలుంటే పరిష్కరించాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, డీటీ ప్రణయ్‌కుమార్, అంగన్‌వాడీ టీచర్ శారద, మునిసిపల్ సిబ్బంది లింగం ఉన్నారు.

క్యాంపునకు మోత్కూరు కౌన్సిలర్లు

మోత్కూరు, జనవరి 21: మోత్కూరు మునిసిపల్ చైర్ పర్సన్ తీపిరెడ్డి సావిత్రిమేఘారెడ్డిపై అవిశ్వాసం ప్రకటించిన తొమ్మిది మంది కౌన్సిలర్లు క్యాంపునకు వెళ్లారు. మునిసిపాలిటీలో 12 మంది కౌన్సిలర్లకు ఐదుగురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు, నలుగురు కాంగ్రెస్ కౌన్సిలర్లు చైర్‌పర్సన్‌పై అవిశ్వాసాన్ని ప్రతిపాదించారు. ఈ మేరకు కలెక్టర్‌కు శనివారం వినతిపత్రం అందజేసి అక్కడి నుంచే క్యాంపునకు వెళ్లారు. ఫిబ్రవరి మొదటి లేదా రెండో వారంలో మునిసిపల్ కౌన్సిల్ ప్రత్యేక సమావేశం నిర్వహించే అవకాశముంది. అప్పటి వరకు తొమ్మిది మంది కౌన్సిలర్లు క్యాంపులోనే ఉంటారని తెలిసింది.

ఆయిల్‌పామ్‌పై ఆసక్తి

- ఉమ్మడి జిల్లాలో ఏడాదిలో రెండింతల సాగు
- మార్కెట్ సౌకర్యం, ధరల గ్యారెంటీతో రైతుల్లో ఆసక్తి



ఆయిల్‌పామ్ సాగుపై ఉమ్మడి నల్లగొండ జిల్లా రైతులు ఆసక్తి చూపిస్తున్నారు. ఏడాదిలో రెండింతల సాగు పెరిగింది. వరికి ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించే లక్ష్యంతో ఆయిల్‌పామ్ సాగుచేసే రైతుల కు రాయితీలు ఇస్తోంది. కంపెనీలు గ్యారెంటీ ధరలతో రైతుల వద్ద దిగుబడులను కొనుగోలు చేస్తుండటంతో రైతులు ఆయిల్ పాం సాగువైపు దృష్టి సారించారు. ఏడాదిలో కొత్తగా 9వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ తోటలను రైతుల సాగు చేశారు. నాలుగు ఏళ్లకు పంట దిగుబడి ప్రారంభమై ఏడాది పొడవునా పంటను ఇచ్చే ఆదాయ వనరుగా మారుతుందని రైతులు అంటున్నారు.

- మిర్యాలగూడ

ఉమ్మడి జిల్లాలో ఇప్పటివరకు 15వేలఎకరాల్లో ఆయిల్‌పామ్ తోటలను రైతులు సాగు చేస్తుండగా, 2022-23లో సుమారు 9వేల ఎకరాల్లో రైతులు నూతనంగా సాగును ప్రారంభించినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. గత ఏడాదిలో నల్లగొండ జిల్లాలో 5వేల ఎకరాలు, సూర్యాపేట జిల్లాలో 2,500 ఎకరాలు, యాదాద్రి జిల్లాలో 1,500 ఎకరాల్లో రైతులు ఆయిల్ పామ్ సాగు చేస్తున్నారు.

చీడపీడల బెడద లేదు

ఆయిల్‌పామ్ సాగులో సస్యరక్షణ చర్యల గురించి రైతులకు ఇబ్బందులు తలెత్తవని అధికారులు చెబుతున్నారు. పండ్ల తోటల్లాగా ఈ పంటకు కోతుల, చీడపీడల బెడద ఉండదని, దిగుబడి నష్టం అనేది ఉండదంటున్నారు. నీటి వినియోగం కూడా తక్కువ. ఒక్క ఎకరా వరి సాగుకు సరిపడే నీటితో నాలుగు ఎకరాల్లో ఆయిల్‌పాంను సాగు చేయవచ్చు. ఎకరానికి 57 మొక్కలు నాటుతారు. ఒక్కో చెట్టుకు 15 గెలల వరకు వస్తాయి. ఒక్కో గెల కోతకు వచ్చేందుకు 50 రోజుల సమయం పడుతుంది. ఒక గెల సుమారు 40 నుంచి 60 కిలోల బరువు తూగుతుంది. అంతర పంటల సాగుకు ఎకరానికి రూ.4,200 చొప్పున రైతుఖాతాల్లో ప్రభుత్వం జమచేస్తోంది.

అంతర్‌పంటల సాగుతో అదనపు ఆదాయం

ఆయిల్‌పామ్ పంట దిగుబడి వచ్చేందుకు నాలుగేళ్ల సమయం పడుతుంది. ఈ నాలుగేళ్ల పాటు అంతర్ పంటగా పత్తి, మిరప, పెసర, మినుము, బొబ్బెర, కంది సాగుచేయవచ్చు. రాయితీపై మొక్కలు, డ్రిప్‌ఏర్పాటు, అంతర్‌పంటల సాగుకు ప్రభుత్వం రాయితీ ఇస్తోంది. అంతర్‌పంటలసాగుతో ఎకరానికి రూ.30వేలవరకు ఏటా ఆదాయం పొందే అవకాశం ఉంది.

జిల్లా వారీగా కంపెనీలు

ఆయిల్‌పామ్ 1993-యాక్ట్ ద్వారా జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు యాజమాన్య పద్ధతులపై అవగాహన, నర్సీల పెంపకం, మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు జిల్లాల వారీగా కంపెనీను కేటాయించారు. నల్లగొండ, సూర్యాపేట జిల్లాలు పతంజలి కంపెనీకి, యాదాద్రి జిల్లా ఆయిల్‌ఫెడ్ కంపెనీకి కేటాయించారు. నల్లగొండ జిల్లాలో మూడు, సూర్యాపేటలో రెండు, యాదాద్రిలో ఒక నర్సరీని ఏర్పాటు చేసి రైతులకు మొక్కలు ఇస్తున్నారు. మొక్క ఖరీదు రూ.193 కాగా, రాయితీపై రూ.20కే ఇస్తున్నారు.

రైతులకు నికర ఆదాయం

ఆయిల్‌పామ్ సాగు రైతులకు మార్కెటింగ్ ఇబ్బందులు లేకుండా చేయడంతో పాటు రెండు, మూడు గ్రామాలకు కలిపి కలెక్షన్ సెంటర్లు ఏర్పాటు చేసి కంపెనీలు రైతుల వద్ద నుంచి దిగుబడులను కొనుగోలు చేస్తున్నాయి. 10 నుంచి 14 రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బు జమచేసేలా ఏర్పాటుచేయడంతో రైతులు నికర ఆదాయం పొందుతున్నారు. జిల్లాలకు కేటాయించిన కంపెనీలు నర్సరీలు పెంచి, రైతులకు మొక్కలు అందజేయడమే గాక, ప్రతి నెలా ప్రభుత్వం నిర్ణయించిన ధరకు దిగుబడులు కొనుగోలు చేయడంతో రైతులకు గిట్టుబాటు లభిస్తోందని అధికారులు చెబుతున్నారు. టన్నుకు ప్రస్తుతం రూ.12,627 రైతులకు కంపెనీలు చెల్లిస్తున్నాయి. ఎకరాకు 8 నుంచి 10 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో 2,500 ఎకరాల్లో రైతులు దిగుబడి సాధిస్తున్నారు.

ధరల గ్యారెంటీతో పెరిగిన సాగు



ఆయిల్‌పామ్ దిగుబడులకు నికరమైన ధర అందుతోంది. ప్రభుత్వం పంట దిగుబడి వచ్చే వరకు రైతులకు ఇన్‌పుట్స్ సబ్సిడీ ఇస్తోంది. రైతులు వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారిస్తున్నారు. ఈ సాగుపై ఆసక్తి కలిగిన రైతులకు అవగాహన కల్పించేందుకు ఉద్యానశాఖ ఆధ్వర్యంలో పలు ప్రాంతాలకు రైతులకు క్షేత్రస్థాయి అవగాహన కల్పిస్తున్నాం. లాభాలను ఆర్జించే రైతులను చూసి ఆయిల్ పామ్‌సాగుకు మరికొందరు రైతులు ముందుకు వస్తున్నారు.

- సంగీతలక్ష్మి, నల్లగొండ జిల్లా ఉద్యాన, పట్టు శాఖాధికారి

లాభసాటి ఆదాయం



ఆయిల్‌పామ్ సాగు లాభసాటిగా ఉంది. బత్తాయి లాంటి తోటల కంటే ఆయిల్‌పామ్ సాగులో పెట్టుబడి వ్యయం తక్కువ. శ్రమ కూడా తక్కువే. మూడు నెలలకోసారి మొక్కలకు ఎరువు వేయడం తప్ప పెద్దగా పని ఉండదు. గెలలు కోసే సమయం లో ఇద్దరు లేదా నలుగురు అవసరం అవుతారు. నేను ఏడు ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నా. ఖర్చులు పోగా ఏడాదికి ఎకరానికి రూ.80వేల నుంచి రూ.1లక్ష వరకు ఆదాయం వస్తోంది.

- ఈదయ్య, రైతు, అనుముల

రాజ్యాధికార సాధనకు ముందుకు రావాలి

● ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్

సూర్యాపేటటౌన్, జనవరి 21: పార్టీలకతీతంగా దళిత బహుజనులు రాజ్యాధికార సాధనకు ముందుకు రావాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లాకేంద్రంలోని ఓ హోటల్‌లో జరిగిన జిల్లా ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీఒక్కరు అక్షర జ్ఞానం పెంచుకోవాలని, విద్యతోనే ప్రతీ సమస్య పరిష్కారం సాధ్యమన్నారు. దళితులను ముఖ్యమంత్రి చేయడమే ఎమ్మార్పీఎస్ టీఎస్ లక్ష్యమని, ఆ దిశగా ఎస్సీవర్గీకరణ సాధనకు అనేక ఉద్యమాలు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం డప్పు, చెప్పు వృత్తి కార్మికులను ఆదుకునేలా పింఛన్ అందజేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాదిగల న్యాయమైన డిమాండ్ ఎస్సీ వర్గీకరణకు చర్యలు తీసుకోవాలన్నారు. మాదిగల సమస్యల పరిష్కారానికి అందరితో కలిసి ముందుకు పోవడానికి సిద్ధమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్వాయి పరుశరాం మాదిగ, బచ్చలకూడి నాగరాజు, ఆదినారాయణ, వెంకన్న, నూరయ్య, రమేష్, సునీత, శ్రీనివాస్, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్ మాదిగ

పల్లె వదిలి.. పట్టణానికి పయనం

చౌటుప్పల్ టౌన్/ చౌటుప్పల్ రూరల్/కేతేపల్లి, జనవరి 21: సంక్రాంతి పండుగ ముగియడంతో ప్రజలు పల్లెలు వదిలి హైదరాబాద్ నగరానికి పయనమవుతున్నారు. దీంతో యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని 65వ నంబరు జాతీయ రహదారి ఆదివారం రద్దీగా మారింది. సంక్రాంతి పండుగ కోసం హైదరాబాద్ నుంచి ఏపీ వైపు వెళ్లిన ప్రజలు ఈ నెల 17నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. ఈ నెల 17, 18వ తేదీల్లో హైదరాబాద్ వైపు బారులు తీరిన వాహనాలు 19, 20వ తేదీల్లో హైవేపై నామ మాత్రంగావెళ్లాయి. మళ్లీ ఆదివారం మధ్యాహ్నం నుంచి వాహనాలు బారులు తీరాయి. వారం రోజులుగా ఏపీలోని సొంతూళ్లలో పండుగ సంబరాల్లో గడిపిన కుటుంబాలు వాహనాల్లో హైదరాబాద్‌కు బయలుదేరడంతో హైవేపై వాహనాల రద్దీ నెలకొంది. పట్టణంలో ఆదివారం వారాంతపు సంత ఉండడంతో జంక్షన్ల వద్ద అదనపు పోలీసు సిబ్బందిని ఏర్పాటుచేశారు. చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా ఆదివారం 55వేల వాహనాల రాకపోకలు కొనసాగించాయి. సాధారణ రోజుల్లో రోజుకు 40వేల వాహనాలు రాకపోకలు కొనసాగిస్తుండగా, ఆదివారం 15వేల వాహనాలు అదనంగా వెళ్లాయి. హైదరాబాద్ వైపు 35వేల వైపు వాహనాలు పయనించాయి. నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం కొర్లపహాడ్ టోల్‌ప్లాజా మీదుగా సాధారణ రోజులు 20వేల వాహనాలు రాకపోకలు కొనసాగిస్తుండగా, ఆదివారం 25వేల వాహనాలు వెళ్లాయి.



చౌటుప్పల్‌లో వాహనాల రద్దీ

ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్	డిఎస్ఎల్ మాల్ - ఉప్పల్
ఎ.ఎం.బి. - గచ్చిబౌలి	ఏషియన్ వైష్ణవి - ఆర్.సి.పురం
సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట	ఏషియన్ సత్యం - అమీర్‌పేట్
ఫోరం మాల్ - కూకట్‌పల్లి	సినీ ప్లానెట్ - కొంపల్లి
ఆర్.కె. - బంజారాహిల్స్	ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్
ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్	ఏషియన్ రాధిక - కాప్రా
గలేరియా - పంజాగుట్ట	ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్
ఐకాన్ - హైటెక్‌సిటీ	ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి
పివిఆర్ సినిమాస్ - ఎర్రమంజిల్	మీరజ్ శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్
పివిఆర్ సినిమాస్ - ముసారాంబాగ్	మీరజ్ సినిమాస్ - బాలానగర్
ప్రెస్టన్‌మాల్ - గచ్చిబౌలి	మీరజ్ సినిమాస్ - చందానగర్
అట్రియమ్ - గచ్చిబౌలి	లక్ష్మీనరసింహ - మియాపూర్
ఎస్‌2 నోమ - మల్లాపూర్	రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి
జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్	జిపిఆర్ మాల్ - కూకట్‌పల్లి
ఎం.పి మాల్ - కాచిగూడ	మూవీటైమ్ - అమీర్‌పేట
జిఎస్ఎమ్ - మదీనగూడ	ఎస్.ఎల్.ఎన్ - గచ్చిబౌలి
నెక్లెస్ సత్వ - కవాడిగూడ	టివోలి - సికింద్రాబాద్
అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్	విజయలక్ష్మి - ఎల్.బి.నగర్
మంజీరామాల్ - కూకట్‌పల్లి	శివగంగ - దిల్‌సుఖ్‌నగర్
సి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి	షా షహెన్‌షా - చింతల్
మంత్రామాల్ - అత్తాపూర్	లక్ష్మీకళ సినీప్లెడ్ - మూసాపేట్
సుధా - శాలిబండ	మూవీమ్యాక్స్ - మౌలాలి
	జె.పి.సినిమాస్ - చందానగర్



జై శ్రీరామ్

● అంతా రామమయం ● రామ్‌లల్లా ప్రాణప్రతిష్ఠ వేడుకలకు సర్వం సన్నద్ధం ● రోజంతా ధార్మిక కార్యక్రమాలు, ఆలయాల్లో ఎల్ఈడీ స్క్రీన్ల ఏర్పాటు

శతాబ్దాల కల కళ్ల ముందు సాక్షాత్కరిస్తుండటంతో రామ భక్తుల హృదయాలు ఉప్పొంగుతున్నాయి. అనాదిగా శ్రీరామ చంద్రుడిని దైవంగా విశ్వసిస్తున్న భారతీయ హిందువులకు బాలరాముడిగా అయోధ్యలో దర్శనమివ్వనున్నాడు. దీంతో రాంలల్లాను కనులారా వీక్షించే భాగ్యం భక్తులకు దక్కనుంది. శ్రీరాముని జీవితం మానవాళికి ఆదర్శం. అయోధ్యలో శ్రీరాముని మందిరం స్వాభిమాన సంకేతంగా పరిగణిస్తున్న హిందువులకు నేడు ఓ శుభదినం. శ్రీరాముడు జన్మించిన చోటే నూతన ఆలయం నిర్మించాలని వందల ఏళ్లపాటు సాగిన భక్తి ఉద్యమం, పోరాటాల్లో ఉమ్మడి జిల్లావాసుల పాత్ర కూడా ఉండటం అందరికీ గర్వకారణం. దీంతో అయోధ్యలోని నూతన ఆలయంలో బాల రాముడి ప్రాణప్రతిష్ఠ మహోత్సవాలను ఉమ్మడిజిల్లా ప్రజలు వేడుకగా జరుపుకుంటున్నారు.

● భువనగిరి టౌన్, నల్లగొండ

అయోధ్య ఆలయంలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ వేడుక నేపథ్యంలో ఉమ్మడి జిల్లా రామనామ స్మరణతో మార్మోగనుంది. ఉమ్మడి జిల్లాలోని అన్ని ఆలయాల్లో ప్రాణ ప్రతిష్ఠాపన వేడుకలను నిర్వహిస్తున్నారు. ఇందుకోసం ఆలయాలను పూలు, మామిడితోరణాలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉదయం నుంచి రాత్రివరకు పూజలు, ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నప్రసాద వితరణ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ముగ్గులు, శ్లోకాల పఠనం తదితర పోటీలు నిర్వహిస్తున్నారు. ఇంటి లోగిళ్లలో ముగ్గులు వేసి సాయంత్రం ఐదు దీపాలు వెలిగించి బాణాసంచా కాల్చి దీపావళిని జరుపుకునేందుకు రామ భక్తులు సిద్ధమయ్యారు. ఇటీవల పంపిణీ చేసిన అయోధ్య అక్షింతలతో ఇంటింట పూజలు నిర్వహించనున్నారు. బాల రాముడి ప్రాణప్రతిష్ఠాపన వేడుకల వీక్షణకు పలు ఆలయాల్లో ఎల్ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేస్తున్నారు. కాషాయ జెండాలు, ఫ్లెక్సీలతో అలంకరించారు. ర్యాలీల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లా నుంచి..

శతాబ్దాలుగా సాగిన శ్రీరామ జన్మభూమి భక్తి ఉద్యమం, పోరాటాల ఛాయలు ఉమ్మడి జిల్లాలోనూ ఉన్నాయి. రాముడు పుట్టిన చోటే మందిరాన్ని నిర్మించాలని పలు రూపాల్లో సాగిన ఉద్యమాల్లో ఉమ్మడి జిల్లా అంతటా దశాబ్దాలపాటు సాగాయి. 30 అక్టోబర్ 1990, 6 డిసెంబరు 1992న జరిగిన కరసేవలో ఉమ్మడి జిల్లానుంచి సుమారు 1000 మంది రామభక్తులు పాల్గొన్నారు. ఇందుకోసం సొంత ఖర్చులతో రైళ్లలో బయలు దేరిన కరసేవకులను అప్పటి ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం మధ్యలోనే అరెస్టుచేసి అక్కడి జైళ్లకు తరలించింది. దీంతో వందలాది మంది కరసేవకులు రెండు, మూడు వారాలపాటు కాశితో పాటు పలు నగరాల్లోని జైళ్లలో బందీలుగా ఉన్నారు. పోలీసుల నుంచి తప్పించుకున్న మిగతా కరసేవకులు నడకమార్గంలో అయోధ్యకు చేరుకొని కరసేవలో పాల్గొన్నారు. అలాగే ఇంటింటికీ రామజ్యోతి, రామశిలా తదితర ఉద్యమాల్లో వేలాది మంది రామ భక్తులు రాజకీయాలకతీతంగా పాల్గొన్నారు. పలు అయోధ్య ఉద్యమాల్లో పాల్గొన్న ఉమ్మడి జిల్లావాసులపై అప్పటి ప్రభుత్వాలు నమోదు చేసిన కేసులతో వందలాది మంది సంవత్సరాల తరబడి కోర్టుల చుట్టూ తిరిగారు. అయోధ్య ఆలయ నిర్మాణంకోసం గత ఏడాది ఉమ్మడి జిల్లాలోని 6.25 లక్షల కుటుంబాలు రూ.7.25 కోట్ల ప్రత్యక్ష విరాళాలను అందజేశారు. భువనగిరికి చెందిన బీజేపీ నేత గూడూరు నారాయణరెడ్డి ఆలయ నిర్మాణంకోసం రూ.కోటి విరాళాన్ని అందజేసి రామభక్తిని చాటుకున్నారు. అలాగే మరెందరో రామ భక్తులు ఆన్‌లైన్ ద్వార విరాళాలను అందజేశారు.

ముగ్గురికి ఆహ్వానం

రాంలల్లా ప్రాణప్రతిష్ఠాపన వేడుకలకు తెలంగాణ నుంచి 65 మంది భక్తులకు ఆహ్వానం లభించింది. వీరిలోఉమ్మడి జిల్లాకు చెందిన ముగ్గురు ఉండటం విశేషం. బొమ్మలరామారం శ్రీసాయిధామం పీఠాధిపతి స్వామి శ్రీరామానంద ప్రభూజీ, చెరువుగట్టు రామలింగేశ్వర స్వామి ప్రధాన అర్చకులు పోతుగంటి రామలింగేశ్వర శర్మ, భువనగిరికి చెందిన బీజేపీ నేత గూడూరు నారాయణ రెడ్డి ఉన్నారు. అలాగే అయోధ్య సందర్శనకు రైల్వే శాఖా నడుపుతున్న ప్రత్యేక రైళ్ల ద్వారా వేలాది మంది ఉమ్మడి జిల్లా రామ భక్తులు బాల రాముడి దర్శనానికి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు.

అయోధ్య ఆలయంతో గుట్టకు ఆధ్యాత్మిక బంధం

అయోధ్యరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ వేడుకలకు దేశంలోని ప్రముఖ ఆలయాలు కానుకలను పంపుతున్నాయి. తిరుపతి దేవస్థానం లక్ష లడ్డూలను పంపగా భద్రాచలంలోని శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయం ముత్యాల తలంబ్రాలను కానుకగా పంపింది. కానీ తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన యాదగిరిగుట్ట దేవస్థానం అధికారులు మాత్రం మిన్నకుండటంపై భక్తులు చర్చించుకుంటున్నారు. అయోధ్య ఆలయం నిర్మాణంకోసం సాగించిన పలు భక్తి ఉద్యమాల సందర్భంగా గతంలో లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో పలు కార్యక్రమాలు కూడా జరిగాయి. నూతనంగా నిర్మించిన ఆలయానికి దర్వాజాలను సమకూర్చిన హైదరాబాద్‌లోని అనురాధ టింబర్ డిపోనే అయోధ్య ఆలయంలో బిగించిన 18 టేకు దర్వాజాలను రూపొందించింది. దీంతో రెండు ఆలయాల నిర్మాణానికి ఒకే సంస్థనుంచి అందిన దర్వాజాలతో రెండు ఆలయాల మధ్య ఆధ్యాత్మిక బంధం ఏర్పడింది. అయినప్పటికీ లక్ష్మీనర్సింహస్వామి పక్షాన కానుకలను పంపాలనే విచక్షణను విస్మరించారని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అయోధ్య రామాలయం ముగ్గు



భూదాన్‌పోచంపల్లి: అయోధ్యలోని రామాలయంలో ఈ నెల 22న శ్రీరాముడి విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా సర్వత్రా ఆలయాల్లో సందడి నెలకొంది. పట్టణంలోని మాధవనగర్ కాలనీకి చెందిన కలకుంట్ల సౌమ్య ఇంటి ఆవరణలో అయోధ్య రామాలయం ముగ్గు వేసి, తన భక్తి చటుకుంది.

పేపర్ ముక్కలతో రామాలయం

చండూరు: పేపర్ ముక్కలతో అయోధ్య రామాలయం నిర్మించారు చండూరుకు చెందిన విజయ. పట్టణానికి చెందిన చేనేత కుటుంబానికి చెందిన చెరుపల్లి శ్రీనివాస్ కుమార్తె విజయ న్యూస్ పేపర్ ముక్కలతో ఆలయ ఆకృతిని నిర్మించి అందరినీ అబ్బురపరిచింది. రెండు వారాల సమయంలో పూర్తి చేసినట్లు తెలిపారు.



విజయ తయారు చేసిన రామాలయ నమూనా

దశాబ్దాల చరిత్రకు నిదర్శనం.. వేదాంత భజన మందిరం

సూర్యాపేట కల్చరల్: సూర్యాపేట జిల్లాకేంద్రంలోని బొడ్రాయి బజార్‌లోని శ్రీవేదాంత భజన మందిరానికి దశాబ్దాల చరిత్ర ఉంది. భజన మందిరాన్ని 1948లో నిర్మించారు. అప్పట్లో నకిరేకంటి రామలింగం, యామ కన్నయ్య, వెంపటి అప్పయ్య, మోత్కూర్ చంద్రమౌళి, వీరవెల్లి నారాయణ, గుంటి సోములు కలిసి భజనలు చేసేవారు. భజనలు చేయడంతో వేదాంత భజన మందిరంగా ఏర్పాటయ్యింది. అప్పటి తహసీల్దార్ గుండా నారాయణరావు వేదాంత భజన మందిరంకు శంకుస్థాపన చేశారు. అనంతరం 1952 నుంచి వసంత నవరాత్రోత్సవాలు నిర్వహించేవారు. 1978లో ఆలయంలో రాముడి విగ్రహాలను ప్రతిష్ఠించారు. 25ఏళ్ల క్రితం రామాలయాన్ని పునర్నిర్మించారు. 65 ఏళ్లుగా శ్రీవేదాంత భజన మందిరంలో శ్రీరామ నవమి మహోత్సవాలు నిర్వహిస్తున్నారు.



సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వేదాంత భజన మందిరం

వందేళ్ల క్రితమే వెలసిన రామాలయాలు

నడిగూడెం: మునగాల పరగణాను పరిపాలించిన జమిందారు రాజా నాయిని వెంకట రంగారావు, వేణుగోపాలపురానికి చెందిన భూస్వాములు కొల్లు పాపయ్య చౌదరిలు వందేళ్ల క్రితమే దైవభక్తిని చాటుకున్నారు. 1931లో సుమారు రూ.25లక్షల ఖర్చుతో పాపయ్య చౌదరి తన స్వగ్రామమైన వేణుగోపాలపురంలో కోదండ రామస్వామి ఆలయాన్ని నిర్మించారు. ఆలయ ఆలనా పాలన దూప దీప నైవేద్యాలకు 90 ఎకరాల సొంత భూమిని ఇనాంగా ఇచ్చారు. వేణుగోపాలపురం రామాలయానికి ఆ రోజుల్లోనే పెద్ద జీయర్‌స్వామిని తీసుకొచ్చి వందమంది వేదం పండితులతో ఆలయాన్ని ప్రారంభించడం విశేషం.



ఆలయంలో ఉత్సవమూర్తులు

జమిందారు నిర్మించిన సిరిపురం ఆలయం

నడిగూడెం జమిందారు రాజానాయిని వెంకటరంగారావు సిరిపురంలో శ్రీకోందడ రామస్వామి ఆలయాన్ని నిర్మించారు. ఆలయ ఆలన పాలనకు సుమారు 140 ఎకరాల భూమిని ఇనాంగా ఇచ్చారు. నాటి నుంచి నేటి వరకు నిత్యానైవేద్యాలు, సీతారాముల కల్యాణం, పలు ఉత్సవాలు నిర్వహిస్తూ వస్తూన్నారు. జమిందారుల కాలం తర్వాత స్థానికులు ఆలయాన్ని పర్యవేక్షించారు. అనంతరం వేణుగోపాలపురం, సిరిపురం ఆలయాలు దేవాదాయ ధర్మదాయ శాఖ పరిధిలో తీసుకున్నారు.

వచ్చే నెల 4న అయోధ్యకు ప్రత్యేక రైలు

1400 మందితో.. నాలుగురోజులపాటు ప్రయాణం

కేంద్ర ప్రభుత్వం అయోధ్య రామమందిర ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. పూజల సందర్భంగా ఆహ్వానితులకు మాత్రమే అయోధ్యలో రాముడిని దర్శించకునే అవకాశం కల్పించిన నేపథ్యంలో ఈ నెల 23 నుంచి సాధారణ భక్తులకు దర్శనంకోసం అనుమతిస్తున్నారు. ఇక కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ నియోజకవర్గాలవారీగా ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసింది. వచ్చే నెల 4వ తేదీన అయోధ్యకు నల్లగొండ నుంచి ప్రత్యేక రైలు బయలుదేరనుంది. మొత్తం 1400 మంది భక్తులతో ఈ రైలు వెళ్లనుంది. మొత్తం నాలుగు రోజులపాటు ఈ ప్రయాణం ఉండగా, మూడు రోజుల పాటు రైలు ప్రయాణం పోగా ఒకరోజు మాత్రం అయోధ్యలో రాముడిని దర్శించుకునేందుకు అవకాశం కల్పిస్తున్నారు. ఒక్కో భక్తుడు ప్రయాణానికి రూ.2వేలు రవాణా చార్జీగా నిర్ణయించారు. ఈ రూ.2వేలతో ప్రత్యేక రైలులో రానుపోను ప్రయాణించవచ్చు.



రెండుసార్లు అరెస్ట్ చేశారు

ఎల్‌కె అడ్వాణీ పిలుపుతో నాడు కరసేవకులుగా వెళ్లాం. హైదరాబాద్‌లోని సైఫాబాద్‌లో మొదటగా అరెస్టు చేసి హాస్టల్‌లో నిర్బంధించారు. విడుదల చేశాక వందలాది మంది కలిసి అయోధ్యకు చేరుకున్నాం. అక్కడికి వెళ్లి తిరిగి వస్తుంటే భువనగిరి రైల్వే స్టేషన్‌లో మమ్మల్ని పోలీసులు అరెస్టు చేశారు. మూడు దశాబ్దా తర్వాత అయోధ్యలో శ్రీరాముడికి ఆలయ నిర్మాణం పూర్తయి విగ్రహ ప్రాణప్రతిష్ఠ జరుగుతుండటం ఆనందంగా ఉంది.

● గుండ్ల నర్సింహ, కరసేవక్, పెద్దకాపర్తి, చిట్యాల మండలం.



జైలు జీవితం గడిపాం

బాబ్రీ మసీద్ అల్లర్ల సంఘటనకు సంబంధించి నేను 10రోజులు జైలు జీవితాన్ని గడిపాను. నాడు కరసేవలో భాగంగా బాబ్రీ మసీద్ వద్దకు వెళ్లిన సమయంలో అక్కడి పోలీసులు బంధించి ఫతేపూర్ జైళ్లో 10రోజుల పాటు ఉంచారు. అయోధ్యలో రామమందిర నిర్మాణం చూస్తామనుకోలేదని, ఈ నెల 22న ఆలయాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. కరసేవలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నాను.

పాల్వాయి భాస్కర్‌రావు, కరసేవక్, నార్కట్‌పల్లి



కలగానే మిగులుతుందనుకున్నా..

1990లో ఈ ప్రాంతం నుంచి 52 మందితో కలిసి అయోధ్యకు వెళ్లాం. మాపై లాఠీచార్జీ జరిపి మీర్జాపూర్ జైలుకు తరలించారు. 23 రోజులపాటు జైలు జీవితం గడిపాం. చివరగా ఓ సర్టిఫికేట్ (ప్రమాణ్ పత్ర్) చేతిలో పెట్టి పంపారు. శ్రీరామ జన్మభూమిలో ఆలయ పునర్నిర్మాణం కలగానే మిగులుతుందనుకున్నా. భారతీయుల చిరకాల వాంఛ నెరవేరింది. రాంలల్లా తిరిగి తన జన్మస్థానానికి చేరుకున్నాడు. ఈ రోజు చారిత్రాత్మకమైన రోజుగా మిగలనుంది.

చెరుపల్లి చంద్రమౌళి, కర సేవకుడు, మిర్యాలగూడ



చిరకాల స్వప్నం నెరవేరింది

హిందువుల చిరకాల స్వప్నం నెరవేరింది. 1992లో వలిగొండ మండలం నుంచి నలుగురు కరసేవకులుగా వెళ్లాం. కాశీలో నిద్రిస్తుండగా అర్ధరాత్రి పోలీసులు వచ్చి మమ్మల్ని అరెస్ట్‌చేశారు. ఆ మరుసటి రోజు అంబర్‌పేట కార్పొరేటర్ నందరాజ్‌గౌడ్ బృందంతో కలిసి ధర్నా చేశాం. పోలీసులు మమ్మల్ని వదిలిపెట్టగా అటునుంచి అయోధ్యకు వెళ్లి కరసేవలో పాల్గొన్నాం.

బందారపు రాములు, కరసేవకుడు, దాసిరెడ్డిగూడెం, మండలం వలిగొండ

భక్తజనసంద్రం.. యాదగిరిక్షేత్రం

● కోలాహలంగా ఆలయ తిరువీధులు..సేవా మండపాలు ● వైభవంగా ఏకాదశి లక్షపుష్పార్చనలు..నిత్యారాధనలు



లక్ష పుష్పార్చన పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, జనవరి21: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధి ఆదివారం భక్తజనసంద్రాన్ని తలపించింది. వారాంతపు సెలవు రోజు కావడంతో పలు ప్రాంతాలనుంచి భక్తులు తండోపతండాలుగా దేవదేవుడి దర్శనాలకోసం తరలివచ్చారు. భక్తజనుల హరిహరుల నామస్మరనలతో క్షేత్రం ఆధ్యాత్మికతతో వెల్లివిరిసింది. ఆలయ తిరువీధులు, ఆర్జిత సేవా మండపాలు భక్తనులతో కోలాహలంగా కనిపించాయి. ఉభయ దర్శనాల క్యూలైన్లు, ప్రసాదాల విక్రయశాల వద్ద క్యూలైన్లు భక్తులతో కిక్కిరిసిపోయాయి. కొండకింద కల్యాణకట్టలో మొక్కుతలనీలాలు సమర్పించిన భక్తులు లక్ష్మీపుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి కొండపైకి స్వామివారి దర్శనాలకోసం ఉచిత బస్సుల్లో తరలివచ్చారు. ఉభయ దర్శనాల క్యూలైన్లలో భక్తులు గంటల తరబడి వేచివుండి కొండగుహలో కొలువైన ఇష్టదైవాన్ని దర్శించుకున్నారు. స్వామివారి ధర్మదర్శనాలకు సుమారు 3గంటలు.. ప్రత్యేక దర్శనాలకు గంట సమయం పట్టిందని భక్తులు తెలిపారు. స్వామికి ప్రసాదాల విక్రయం ద్వారా రూ.20.84లక్షల ఆదాయం సమకూరిందని, ఉదయం, సాయంత్రం రెండు దఫాలుగా కొనసాగిన బ్రేక్ దర్శనాల్లో సుమారు 1182 మంది భక్తులు, యాదగిరిక్షేత్రాన్ని ఒక్క రోజే సుమారు 40వేలకు పైగా భక్తులు ఇష్టదైవాలను దర్శించుకున్నట్లు దేవస్థాన అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా అనుబంధ పాతగుట్ట ఆలయంలోనూ యాత్రాజనుల రద్దీనెలకొంది. పాతగుట్ట ఆలయంలో స్వయంభువులను దర్శించుకుని సేవోత్సవాల్లో పాల్గొని భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం ఆలయ తిరువీధుల్లో పిల్లాపాపలతో బస ఏర్పాటు చేసుకుని సేదతీరారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.46,63,688 ఆదాయం సమకూరినట్లు దేవస్థాన అధికారులు తెలిపారు.



ప్రధాన ఆలయంలో క్యూలైన్లలో భక్తుల రద్దీ

ఆగమశాస్త్ర రీతిలో నిత్యారాధనలు

యాదగిరిక్షేత్రంలో ఆదివారం ఏకాదశి పర్వదినం సందర్భంగా లక్ష పుష్పార్చనలు, నిత్యారాధనలు ఆగమ శాస్త్రరీతిలో వైభవంగా కొనసాగాయి. సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపిన అర్చకులు స్వయంభువులను అభిషేకించి అర్చించారు. ముఖమండపంలో ఉత్సవమూర్తులను దివ్యమనోహరంగా అలంకరించి స్వర్ణ సింహాసనంపై అధిష్ఠింపజేశారు. స్వామి, అమ్మవార్ల సహస్రనామ పఠనాలతో లక్షపుష్పార్చన పూజలు నిర్వహించారు. అనంతరం ప్రాకార మండపంలో హోమం, నిత్యతిరుకల్యాణోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. శివాలయంలో రామలింగేశ్వరుడికి నిత్య పూజలు శైవాగమ పద్ధతిలో కొనసాగాయి.

మహాద్భుతం యాదగిరిక్షేత్రం : కేంద్ర మంత్రి ఆర్‌కే సింగ్

యాదగిరిక్షేత్రాన్ని మహాద్భుతంగా శిల్పకళా సంపదతో పునర్నిర్మాణం జరిపినట్లు కేంద్ర విద్యుత్, పునరుత్పాదక ఇందనశాఖ మంత్రి ఆర్‌కే సింగ్ కొనియాడారు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రాన్ని సందర్శించారు. క్షేత్ర సందర్శనకు విచ్చేసిన ఆయనకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆయన ప్రధానాలయంలో మూలవర్యులను దర్శించుకుని ముఖమండపంలో ఉత్సవమూర్తుల వద్ద లక్ష పుష్పార్చన పూజల్లో పాల్గొన్నారు. అర్చకులు ఆయనకు ఆశీర్వచనం అందజేయగా.. ఇన్‌చార్జి ఈవో రామకృష్ణారావు స్వామివారి అభిషేకం లడ్డూ ప్రసాదాలను అందజేశారు. స్వామిని త్రిపుర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.అమర్‌నాథ్ గౌడ్ కుటుంబసమేతంగా దర్శించుకున్నారు.

అంతటా ఆధ్యాత్మిక శోభ

● జిల్లావ్యాప్తంగా ఆలయాలు ముస్తాబు ● దేవాలయాలను శుభ్రం చేసిన భక్తులు ● ప్రత్యేక ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు



చౌటుప్పల్‌లో రామాయణ నాటక ప్రదర్శనలో విద్యార్థులు

యాదగిరిగుట్ట రూరల్, జనవరి 21: అయోధ్యలో రామ మందిర ప్రారంభోత్సవంలో భాగంగా మండలంలోని గౌరాయిపల్లిలోని రామాలయం ముస్తాబైంది. ఆలయానికి రంగులు, తోరణాలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉదయం 6గంటల నుంచి 7గంటల వరకు నగర సంకీర్తన, 7.30 గంటల నుంచి 9గంటల వరకు స్వామి వారికి ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమం నిర్వహిస్తారు. 9గంటల నుంచి 10 గంటల వరకు కోలాటం, భరత నాట్యం, 10గంటల నుంచి 2గంటల వరకు అయోధ్య శ్రీరామ ప్రాణప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని స్ర్కీన్ ద్వారా వీక్షిస్తారు. మాసాయిపేట గ్రామంలోని కోదండ రామస్వామి ఆలయాన్ని ముస్తాబు చేశారు.

చౌటుప్పల్ టౌన్: శ్రీరాముడు సాగించిన ధర్మ పరిపాలన మానవాళికి ఆదర్శవంతంగా నిలిచిందని చౌటుప్పల్ ట్రినిటీ విద్యా సంస్థల చైర్మన్ కెవీబీ కృష్ణా రావు, ప్రిన్సిపాల్ మంజుల అన్నారు. విద్యార్థులు శ్రీరాముడు, సీత, లక్ష్మణుడు, ఆంజనేయుడు తదితర వేషధారణలతో రామాయణ నాటకాన్ని ప్రదర్శించారు. ఈ నాటక ప్రదర్శనతో రామాయణం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు.

మోటకొండూరు: మండల కేంద్రంలో హనుమాన్ యూత్ అధ్వర్యంలో హనుమాన్ దేవాలయాన్ని శుభ్రం చేశారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో హనుమాన్ యూత్ అధ్యక్షుడు రేగు ఉపేందర్, రేగు చంద్రశేఖర్, శ్రీశైలం, అలేటి నాగరాజు పాల్గొన్నారు.

వలిగొండ: రామాయణ, మహాభారత పవిత్ర గ్రంథాలను పఠించాలని యజ్ఞ ఫౌండేషన్ సంస్థ అధ్యక్షుడు పాలెం వెంకటేష్ సూచించారు. మండల కేంద్రంలో హరిహర త్రిశక్తి ఆలయంలో అమ్మవార్లను దర్శించుకొని 101 కొబ్బరికాయలు కొట్టారు. కార్యక్రమంలో యాట మహేందర్, బడుగు హరినాథ్, నల్ల భూమిక, కె రాణాప్రతాప్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాజాపేట: మండలంలోని ఆలయాలను శుద్ధి చేసి, ముస్తాబు చేశారు. మామిడి తోరణాలతో, రాముడి చిత్రలతో కూడిన తోరణాలతో అలంకరించారు. గ్రామాల్లో అన్నదానం చేసేందుకు ఏర్పాట్లు చేశారు.

భూదాన్‌పోచంపల్లి: భూదాన్‌పోచంపల్లి పట్టణంతోపాటు మండల వ్యాప్తంగా అన్ని దేవాలయాల్లో ఉత్సవాలకు ఏర్పాట్లు చేశారు. పట్టణంలోని మార్కండేశ్వరస్వామి దేవాలయంతోపాటు, లక్ష్మీనారాయణస్వామి దేవాలయం, మహమ్మాయి దేవాలయం, భక్తాంజనేయస్వామి, సాయిబాబా ఆలయాలను సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దారు. మార్కండేశ్వరస్వామి ఆల యంలో ఉదయం 5 గంటలకు సీతారామచంద్రస్వామి వారి సుప్రభాతం, 6 గంటలకు స్వామివారికి విశేష అభిషేకము, అనంతరం సామూహిక శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, సీతారామచంద్రస్వామి పూజ, శ్రీరామ యజ్ఞం, అనంతరం భజనలు, కీర్తనలు నిర్వహిస్తారు. అయోధ్యలో బాలరాముని ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఎల్‌ఈడీ స్ర్కీన్‌పై ప్రత్యక్ష ప్రసారం చేస్తారు. అనంతరం కరసేవకులకు సన్మానంతోపాటు భక్తులకు మహాన్న దాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రాత్రి 7 గంట లకు పట్టణంలో స్వామివారి ఊరేగింపు సేవ నిర్వహిస్తామని తెలిపారు.



భువనగిరి పట్టణంలోని ఆలయంలో...



మోటకొండూరులో

భువనగిరి రూరల్: తండ్రి దశరథుడి మాటకు కట్టుబడి ఉండి ఆదర్శ పాలన చేపట్టిన అయోధ్య రాముడి అడుగు జాడల్లో ప్రతిఒక్కరు పయనించాలని సామాజిక వేత్త డాక్టర్ కస్తూరి లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని వీరవెల్లిలో శ్రీరాముడి చరిత్రకు సంబంధించిన బుక్‌లెట్‌లను గ్రామస్థులకు అందజేశారు. మండలంలోని గంగసానిపల్లి సమీపంలో గల శాఖాహార గ్రామ దక్షిణ షిర్డిసాయి క్షేత్రంలో ఏర్పాటు చేసిన సీతా సమేత శ్రీరామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ధ్యానర్షి మెగా మురళి ఆధ్వర్యంలో గ్రామ సంకీర్తన కార్యక్రమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాంపల్లి, నగేష్‌గౌడ్, ధ్యాన సరస్వతి మెగా అనురాధ, గంగదేవి మహేష్, పాల్గొన్నారు. అనంతరం అన్నదానం చేశారు.

రామన్నపేట: రామన్నపేటలోని హనుమాన్ దేవాలయంలో శుద్ధి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ, పీఏసీఎస్ డైరెక్టర్ కన్నెకంటి వెంకటేశ్వరాచారి, సిందం లింగయ్య, మామిళ్లపల్లి ధీరజ్, సుర్వి హరిబాబు, కామిశెట్టి కిషన్, కామిశెట్టి రాంబాబు, లవణం సాయి, గంగాపురం భూపాల్‌గౌడ్ పాల్గొన్నారు.



గౌరాయిపల్లి గ్రామంలో ఉత్సవాలకు ముస్తాబైన శ్రీరాముని ఆలయం

చౌటుప్పల్ టౌన్: చౌటుప్పల్ పట్టణంలోని సీతారామచంద్రస్వామి దేవాలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. పట్టణంలో 125 సంవత్సరాల నుంచి సీతారాముల కల్యాణోత్సవాలను నిర్వహిస్తున్నారు. పురాతన భవానీ మాతా దేవాలయం వద్ద శ్రీరామ నవమి రోజున రాత్రి పూట రావి చెట్టు కింద సీతారాముల ఫొటోలు పెట్టి గ్రామ పెద్దల సమక్షంలో కల్యాణం నిర్వహించేవారు. 1960 ప్రాంతంలో అప్పటి సర్పంచ్ చింతల కృష్ణారెడ్డి సొంతంగా రూ.10వేలు వెచ్చించి హైదరాబాద్ లో సీతారాముల విగ్రహాలు కొనుగోలు చేసి దేవాలయానికి దాన పూర్వకంగా అందజేశారు. నాటి నుంచి నేటి వరకు ఆ విగ్రహాలతోనే కల్యాణాన్ని నిర్వహిస్తున్నారు.



విద్యుత్ దీపాలతో చౌటుప్పల్‌లోని సీతారామచంద్రస్వామి దేవాలయం

నేడు పంచకుండాత్మక మహా సుదర్శన యాగం



విద్యుత్ దీపాలతో దాచారంలోని ప్రాచీన రామాలయం



మోత్కూరు: అయోధ్య రామాలయం ప్రారంభోత్సవ నేపథ్యంలో మండలంలోని దాచారం గ్రామ పురాతన రామాలయంలో సోమవారం పంచకుండాత్మక మహా సుదర్శన యాగం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు పూజారి పత్రాపురం శ్రీనివాసాచార్యులు తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు యాగం నిర్వహిస్తామన్నారు. ఈ ఆలయం మూలమూర్తి శ్రీమద్రామానుంజులు వెలిసింది. ఇందులో ఆంజనేయ, లక్ష్మణ సమేత సీతారామచంద్రమూర్తి పంచలోహ ఉత్సవ విగ్రహాలకు నిత్య పూజలు నిర్వహిస్తారు. ఆలయంలోని పంచలోహ విగ్రహాలను గతంలో దొంగలు దొంగిలించగా కొద్ది రోజులకే దొరకడం విశేషం. ఆలయానికి ఉత్తర ద్వారం ఉంది. ఆలయాన్ని ఆనుకుని ఉన్న చెరువును రామసముద్రమని, బండను రాముని బండ అని పిలుస్తారు. ఇక్కడ రెండు గుండంలు(పుష్కరిణిలు) ఉన్నాయి. రావణాసురుడు సీతాదేవిని ఎత్తికెళ్లినప్పుడు సీతాదేవి అన్వేషణలో రామలక్ష్మణులు ఇక్కడ కొద్ది రోజులు ఉన్నారని, వారు ఆ గుండంలలో స్నానాలు చేసేవారంటారు. అదేవిధంగా మోత్కూరులోని సీతారామచంద్రస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదానం నిర్వహించనున్నట్లు ఆలయ పూజారి పారునంది సూరిబాబుశర్మ తెలిపారు.

సీతారామాపురంలో పురాతన దేవాలయం



సీతారామాపురం గ్రామంలోని దేవాలయం

గుండాల: మండలంలోని సీతారాంపురం సీతారామచంద్రస్వామి ఆలయం ప్రసిద్ధి చెందింది. శ్రీరాముడు మాయలేడిని వెతుక్కుంటూ ఈ ప్రాంతం నుంచి జీడికల్ దేవస్థానానికి వెళ్లాడని ఈ ప్రాంత వాసుల నమ్మకం. గ్రామంలో సుమారు 400ఏళ్ల క్రింత బ్రాహ్మణ దంపతులు ఇక్కడ దేవాలయం కట్టించినట్లు ఈ ప్రాంత వాసులు చర్చించుకుంటారు. దీంతో ప్రతి సంవత్సరం శ్రీరామ నవమి ఉత్సవాలు ఐదు రోజులు అంగ రంగ వైభవంగా నిర్వహిస్తారు. సీతారామచంద్ర స్వామి కల్యాణాన్ని తిలకించడానికి చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పెద్దసంఖ్యలో హాజరవుతారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సంస్థాన్‌నారాయణపురంలో సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు

చౌటుప్పల్, జనవరి 21: సంస్థాన్‌నారాయణపురం మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1990-91వ బ్యాచ్ విద్యార్థులు చౌటుప్పల్ మండలంలోని దండు మల్కాపురం ఆందోళన మైసమ్మ దేవాలయం వద్ద శనివారం సమ్మేళనం నిర్వహించారు. 33 సంవత్సరాల క్రితం ఒకే పాఠశాలలో చదువుకున్న విద్యార్థులంతా కుటుంబసభ్యులతో కలిసి ఒకచోట కలుసుకున్నారు. ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు లక్ష్మణాచారి, నీళ్ల లింగస్వామి, నేర్లకంటి పరమేష్, రాపర్తి శ్రీనివాస్, జక్కిడి జంగారెడ్డి, సాదు రవి, నాతి లింగస్వామి, కొండ పవన్, ఉప్పల ముత్యాలు, చిలువేరు అంజయ్య, శోభ, సక్కుబాయి, గోపమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

చౌటుప్పల్ టౌన్: వలిగొండ మండలం గొల్నేపల్లి జడ్పీహెచ్‌ఎస్‌లో 1997-98 సంవత్సరంలో 7వ తరగతి పూర్వ విద్యార్థులు చౌటుప్పల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆనాటి హెచ్‌ఎం శివగళ్ల నర్సింహను విద్యార్థులు సన్మానించారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

మోత్కూరు, జనవరి 21: వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాలోని పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు పర్రెపాటి యుగంధర్ కోరారు. ఆదివారం మోత్కూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఫిబ్రవరి 6వ తేదీ లోపు పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలన్నారు. నమోదుకు చివరి రోజుల్లో సర్వర్ బిజీ లాంటి సమస్యలు తలెత్త వచ్చని, ఇప్పుడే ఓటు నమోదు చేసుకోవడం మంచిదన్నారు. కాంగ్రెస్ శ్రేణులు పట్టభద్రులను గుర్తించి ఓటు నమోదు చేసుకునేలా చూడాలన్నారు.

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలి

ఆత్మకూరు(ఎం) జనవరి 21: గ్రామీణ క్రీడాకారులను పోత్సహించాలని ఎస్‌ఐ డి. నాగరాజు కోరారు. బీజేపీ మండల యువమోర్చా అధ్యక్షుడు పొన్నగాని రవీందర్ స్మారకార్థం మండలంలోని పుల్లాయిగూడెంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ఆదివారం ముగిశాయి. పుల్లాయిగూడెం(ప్రథమ), రాఘవాపురం(ద్వితీయ) బహుమతులు సాధించాయి. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు తడిసిన మల్లారెడ్డి, సర్పంచ్ పెసర గిరిజ, ఉపసర్పంచ్ ఆవుల రమేష్, సుభాష్‌రెడ్డి, బి.అబ్బయ్య, ఎం. నరేష్, పరశురాములు, సంతోష్, రామలింగయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన ధర్మారం సర్పంచ్



ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న సర్పంచ్

అడ్డగూడూరు, జనవరి 21: మండలంలోని ధర్మారం సర్పంచ్ శీలం జ్యోతి తిరుమలగిరి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే మందుల సామేలు సమక్షంలో బీఆర్‌ఎస్‌ను వీడి ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే వీరికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాశం సత్యనారాయణ, వళ్లంభట్ల రవీ పాల్గొన్నారు.

తెలంగాణ సాధనలో ఉద్యమకారుల పాత్ర కీలకం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

వలిగొండ, జనవరి 21: తెలంగాణ సాధనలో ఉద్యమకారుల పాత్ర కీలకమని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో మండలకేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డికి శనివారం నిర్వహించిన కృతజ్ఞత సభలో ఆయన మాట్లాడారు. సబ్బండ వర్గాలు సమష్టిగా, స్వచ్ఛందంగా ఉద్యమంలో పాల్గొన్నాయని తెలిపారు. రాస్తారోకోలు, సకల జనుల సమ్మెలో ఉద్యోగుల పెన్‌డౌన్, విద్యార్థుల తరగతుల బహిష్కరణ, వంటావార్పు, కళాకారుల ఆటాపాటలతో దూందాంలు ఉద్యమాన్ని ఉవ్వెత్తున నిలిపారని కొనియాడారు. శ్రీకాంతాచారి, వేణుగోపాల్‌రెడ్డి లాంటి ఉద్యమకారులెందరో తమ ప్రాణాలను సైతం రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసి ఉద్యమ స్ఫూర్తిని రగిలించారని కొనియాడారు. ప్రొఫెసర్ కోదండరాం లాంటి మేధావి జేఏసీ చైర్మన్‌గా ముందుండి ఉద్యమాన్ని నడిపించి రాష్ట్రం ఏర్పాటుకు కృషి చేస్తే నాటి సీఎం కేసీఆర్ ఆ చరిత్రను మరిచి అంతా తనవల్లే తెలంగాణ సాధ్యమైందని అహంకార పూరితంగా వ్యవహరించారన్నారు. కేసీఆర్ పది సంవత్స రాల పాలనలో రాష్ట్రంలోని ఏ వర్గానికీ న్యాయం జరగలేదన్నారు. నేడు సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో ప్రజాస్వామ్య పాలన సాగుతోందన్నారు. ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ ప్రభుత్వాన్ని ఓడించిన ఘనత తెలంగాణ ఉద్యమకారులదేనని అని అన్నారు. సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సంగిశెట్టి కృష్ణఫర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ నూతి రమేష్‌రాజు, జడ్పీటీసీ వాకిటి పద్మ అనంతరెడ్డి, సర్పంచ్ బోళ్ల లలితా శ్రీనివాస్, ఎంపీటీసీ యశోధ, ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు జ్యోతిరెడ్డి, కార్యదర్శి మాధవి, ఉపాధ్యక్షురాలు ఉమారాణి, నాయకులు కళ్లెం లక్ష్మారెడ్డి, బత్తిని రవీందర్, పబ్బు ఉపేందర్ బోస్, మారగోని శ్రీనివాస్, గంధమల్ల మల్లమ్మ, కొండూరి నీలమ్మ, పుష్పమ్మ తదితరులు పాల్గొన్నారు.

చదువుకున్న కళాశాలను అభివృద్ధి చేసుకుందాం



సమావేశంలో మాట్లాడుతున్న జిట్టా బాలకృష్ణారెడ్డి

భువనగిరి టౌన్, జనవరి 21: చదువుకున్న కళాశాలను అభివృద్ధి చేసుకుందామని తెలంగాణ ఉద్యమకారుడు జిట్ట బాలకృష్ణారెడ్డి అన్నారు. భువనగిరిలో ఆదివారం నిర్వహించిన సీఎస్‌ఎన్‌ఆర్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. కళాశాలలో ప్రవేశాల పెంపునకు, మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో మునిసిపల్ మాజీ చైర్మన్ పెంట నర్సింహ, మాజీ ఎంపీపీ అతికం లక్ష్మీనారాయణగౌడ్, మునిసిపల్ వైస్‌చైర్మన్ చింతల కిష్టయ్య, కౌన్సిలర్లు పోతంశెట్టి వెంకటేశ్వర్లు, గోమారి సుధాకర్‌రెడ్డి, కొలుపుల వివేక్, జైని రవీందర్, ఎస్‌కె అమిద్ పాషా, కె సోమయ్య పాల్గొన్నారు.

ప్రజా నాయకుడు బండ్రు నర్సింహులు : విప్ బీర్ల



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

ఆలేరు రూరల్, జనవరి 21: ప్రజలు మెచ్చిన ప్రజా నాయకుడు కామ్రేడ్ బండ్రు నర్సింహులు అని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య కొనియాడారు. ఆలేరులో ఆదివారం నిర్వహించిన నర్సింహులు రెండో వర్ధంతి సందర్భంగా ఆయన స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అయిలయ్య మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో గళనాయకుడై పేదల పక్షాన పోరాడి అమరుడైన గొప్ప నేత నర్సింహులు అని అన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఆయన చూపిన మార్గం నేటికీ అనుసరణీయమన్నారు. కార్యక్రమంలో అరుణోదయ సాంస్కృతిక సారథి అధ్యక్షురాలు బండ్రు విమలక్క, బండ్రు శోభారాణి, బండ్రు ప్రభాకర్, యాదగిరిగుట్ట ఎంపీపీ చీర శ్రీశైలం, సీఆర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రాజు, కౌన్సిలర్ గుత్త శమంతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా సురేష్



ఆలేరు రూరల్: యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా మండలంలోని మందనపల్లికి చెందిన ఊట్కూరి సురేష్‌గౌడ్ నియమితులయ్యారు. నియామకపత్రాన్ని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఆదివారం సురేష్‌కు అందజేశారు. కాంగ్రెస్ బలోపేతానికి బాధ్యతతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కాంద్రాజు వెంకటేశ్వర్‌రాజు, ఎంపీపీ గంధమల్ల అశోక్, పల్లె సంతోష్, కర్రె అజయ్, కాంద్రాజు శివశంకర్, పర్రె రమేష్, మధు, జాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరం ప్రారంభం

వలిగొండ: మండలంలోని మాందాపురం గ్రామంలో భువనగిరి శ్రీఆర్‌కే ఆస్పత్రి, చావా ఫౌండేషన్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజలకు సేవ చేస్తున్న డాక్టర్ రాజ్‌కుమార్ దంపతులను ఎమ్మెల్యే అభినందించారు. 150 మందికి పైగా వైద్య సేవలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నూతి రమేష్‌రాజు, జడ్పీటీసీ వాటికి పద్మ అనంతరెడ్డి, సర్పంచ్ సాగర్‌రెడ్డి, ఎంపీటీసీ నర్సింహ పాల్గొన్నారు.

చైతన్య యువజన సంఘం నూతన కార్యవర్గం

భూదాన్‌పోచంపల్లి: పట్టణ పరిధిలోని రేవణపల్లికి చెందిన చైతన్య యువజన సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుండు రాజు, ఉపాధ్యక్షులుగా దుద్యాల రవీందర్, ప్రధాన కార్యదర్శిగా వనం వెంకటేశం, సహాయ కార్యదర్శిగా చిలువేరు రాములు, కోశాధికారిగా గుర్రం నర్సింహ, సాంస్కృతిక కార్యదర్శిగా రవ్వ లక్ష్మయ్య, క్రీడాకార్యదర్శిగా గుర్రం నాగేశ్వర్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవంలో కౌన్సిలర్ గుండు మధు, కాంగ్రెస్ నాయకులు మర్రి నర్సింహారెడ్డి, గౌతమీ స్కూల్ కరస్పాండెంట్ రావుల జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఎన్నిక

బొమ్మలరామారం: టీఎస్ ఎమ్మార్పీఎస్ మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చౌదరిపల్లి గ్రామానికి చెందిన మైలారం జంగయ్య, ఉపాధ్యక్షుడిగా బాణాల నగేష్, ప్రధాన కార్యదర్శిగా రంగపురం శ్రీకాంత్, అధికార ప్రతినిధిగా మైలారం రాజు, మండల యువసేన అధ్యక్షుడిగా మైలారం రమేష్, కార్యవర్గ సభ్యులుగా గజ్వేలి భిక్షపతి, బాలరాజు, మొగులయ్య, రొంపి గణేష్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో టీఎస్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి రంగపురం స్వామి, తూడి నారాయణ, సరిపాక మల్లేష్, స్వామి, సురేష్, రాంబాబు పాల్గొన్నారు.

18ఏళ్లు నిండిన వారికి ఓటు హక్కు కల్పించాలి

అడ్డగూడూరు: 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరికీ హక్కు కల్పించాలని తహసీల్దార్ అమనగంటి శేషగిరిరావు అన్నారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా మండలంలోని చౌళ్లరామారం, చిన్నపడిశాల, జానకీపురం, కోటమర్తి, అడ్డగూడూరు పోలింగ్ కేంద్రాలను ఆదివారం పరిశీలించారు.

లెనిన్ ఆచరించిన విప్లవ పంథాలో నడుద్దాం

ఆలేరు రూరల్: మార్క్సిస్ట్ మహోపాధ్యాయుడు లెనిన్ చూపిన విప్లవ పంథాలో ప్రజలు నడవాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ జిల్లా కార్యదర్శి ఆర్. జనార్దన్ అన్నారు. ఆదివారం ఆలేరులోని పార్టీ కార్యాలయంలో లెనిన్ శత వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐక్య ప్రజా బలంతో, సంఘటిత కార్మిక శక్తితో సాయుధ విప్లవ పంథాలో వీరోచితంగా పోరాడి కమ్యూనిస్ట్ రాజ్యాన్ని స్థాపించిన గొప్పనేత లెనిన్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బేజాడి కుమార్, రాజయ్య, సుదర్శన్, బాబు, శ్రీకాంత్, శ్రీను, కుమార్, తదితరులు పాల్గొన్నారు.



ఎడ్ల రాజిరెడ్డి సేవలు చిరస్మరణీయం



రాజిరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి

భువనగిరి రూరల్, జనవరి 21 : గ్రామాభివృద్ధికి కృషి చేసిన సర్పంచ్ ఎడ్ల రాజిరెడ్డి సేవలు చిరస్మరణీయమని జడ్పీచైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని హన్మాపురం సర్పంచ్ దశదిన కర్మ పురస్కరించుకొని వారు వేర్వేరుగా పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సుబ్బూరు బీరుమల్లయ్య, మార్కెట్ చైర్మన్ ఎడ్ల రాజేందర్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ ఏనుగు సంజీవరెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మన్ ఎడ్ల సత్తిరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షులు పాశం భాస్కర్, నాయకులు ఎడ్ల వెంకట్‌రెడ్డి, గోమారి ఎల్లారెడ్డి, ధర్మారెడ్డి, వెంకటేశం, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

దశదిన కర్మలో బీజేపీ, బీఆర్‌ఎస్ నేతల ఘర్షణ

మండలంలోని హన్మాపురంలో బీఆర్‌ఎస్ సర్పంచ్ ఎడ్ల రాజిరెడ్డి దశదిన కర్మలో ఇరువురి మధ్య జరిగిన ఘర్షణలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. హన్మాపురంలో సర్పంచ్ ఎడ్ల రాజిరెడ్డి దశదిన కర్మ నిర్వహించారు. గ్రామానికి చెందిన బీజేపీ వార్డు సభ్యుడు తోటకూరి వెంకటేష్, అదే గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు రాగాల శ్రీనివాస్‌ల మధ్య తలెత్తిన గొడవలో ఇరువర్గాలు రాళ్లు రువ్వుకున్నారు. ఈ ఘటనలో అక్కడే ఉన్న అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తి మోటె చందుకు గాయమైంది. గమనించిన స్థానికులు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. బీజేపీ వార్డు సభ్యుడు తోటకూరి వెంకటేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు రాగాల శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్‌ఐ వి.సంతోష్‌కుమార్ తెలిపారు.

ముందుగా మన కార్యకర్తకే నివాళులర్పించాలి

సర్పంచ్ రాజిరెడ్డి దశదినకర్మకు హాజరయ్యేందుకు భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి గ్రామానికి రాగా కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు తుమ్మేటి వెంకటేష్, రాపర్తి కృష్ణలు అడ్డుపడి సర్పంచ్ దశదిన కర్మకంటే ముందు మన కాంగ్రెస్ కార్యకర్త సింగారపు నర్సింహ దశదిన కర్మ కార్యక్రమానికి వెళ్లాలని ఎమ్మెల్యే ఎదుట పట్టుబట్టారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన మరోవర్గం నాయకులు గోమారి ఎల్లారెడ్డి, రంగ మల్లేశ్‌లు ఎమ్మెల్యే సమక్షంలో ఘర్షణపడ్డారు. అక్కడే ఉన్న పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు. దీంతో ఎమ్మెల్యే కుంభం రాజిరెడ్డి చిత్రపటానికి నివాళులర్పించి అక్కడి నుంచి కాంగ్రెస్ కార్యకర్త సింగారపు నర్సింహ దశదిన కర్మకు హాజరై తిరిగి వెళ్లిపోయారు.

విశ్వకర్మ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

భూదాన్‌పోచంపల్లి, జనవరి 21: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ చిక్క కృష్ణ, మాజీ సర్పంచు నోముల గణేష్ కోరారు. 18రకాల చేతి వృత్తిదారులకు వృత్తిలో నైపుణ్యం ఉన్నవారికి లబ్ధి చేకూరాలనే సంకల్పంతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నారన్నారు. పట్టణంలో పీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ పథకానికి సంబంధించి పేర్ల నమోదు కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రచ్చ శేఖర్, వలందాసు మహేందర్, గొలనుకొండ ప్రభాకర్, గంగపురం శ్రవణ్, మూటపురం రవి, భారత బాలరాజు, చిటుకుల అంబదాసు, బాలయ్య, జగదీష్ పాల్గొన్నారు.

ఓటరు నమోదును సద్వినియోగం చేసుకోవాలి

భూదాన్‌పోచంపల్లి, జనవరి 21: ఓటరు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ బి. వీరాబాయి కోరారు. పట్టణంలోని బీఎల్‌వో కేంద్రాలను ఆదివారం పరిశీలించారు. ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలించారు. నూతనంగా ఓటు నమోదు చేయించుకున్నవారికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. 18ఏళ్లు నిండిన యువతకు తప్పనిసరిగా ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేలా చూడాలని బీఎల్‌వోలను కోరారు. ఈ కార్యక్రమాల్లో ఆర్‌ఐ గుత్తా వెంకట్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ సైదిరెడ్డి పాల్గొన్నారు.

ఇంటి ముందు కూర్చున్న వారిపై దూసుకెళ్లిన కారు

మోత్కూరు, జనవరి 21: ఇంటి ముందు కూర్చున్న ముగ్గురు మహిళలపై నుంచి కారు దూసుకెళ్లింది. ఈ సంఘటన మోత్కూరు మునిసిపాలిటీ కేంద్రంలో ఆదివారం జరిగింది. కాలనీ వాసుల కథనం ప్రకారం.. సాయిబాబా ఆలయం సమీపాన వీధి ఆదివారం మధ్యాహ్నం ఓ ఇంటి ముందు మహిళలు కూర్చుని ముచ్చటించుకుంటున్నారు. మెంట చందు అనే డ్రైవర్ మద్యం తాగిన మత్తులో కారును అజాగ్రత్తగా, అతి వేగంగా నడపడంతో కారు ఇంటి ముందు కూర్చున్న మహిళలపై నుంచి వెళ్లింది. నకిరేకంటి గీతకు రెండు కాళ్లు విరగ్గా, బాలెంల యాదమ్మకు నడుముకు, సుక్క రుషిక కాలుకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం క్షతగాత్రులను 108 వాహనంలో భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కారు ప్రమాదంపై తమకు ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

ఉమ్మడి జిల్లా ఖోఖో జట్ల ఎంపిక

భువనగిరి టౌన్, జనవరి 21: ఉమ్మడి నల్లగొండ జిల్లా ఖోఖో మహిళలు, పురుషుల జట్లను ఆదివారం భువనగిరిలో ఎంపిక చేశారు. 100 మందికి పైగా పాల్గొన్న ఈ పోటీల్లో 20మంది చొప్పున 40 మంది క్రీడాకారులను ఎంపిక చేశారు. ఎంపికైన జట్లు ఫిబ్రవరి 9 నుంచి 11 వరకు భువనగిరిలో నిర్వహించే 56వ తెలంగాణ రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో ఉమ్మడి జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తాయి. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఖోఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నాతి కృష్ణమూర్తి, ఉపాధ్యక్షులు పి. రమేష్‌రెడ్డి, ఏ. విజయ్, కె. మురళి, పి. అంజనేయులు, పి. శ్రీశైలం, జి. బాలకృష్ణ, సురేందర్ పాల్గొన్నారు.